క్లుప్తంగా

నేడు సీజ్‌చేసిన వాహనాల వేలం

సాలూరు: పట్టణంలో వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్రవాహనాలు, రెండు ఫోర్ వీలర్స్‌కు సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు.ఆసక్తి గల వారు ఈ బహిరంగ వేలంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఘనంగా దేశమ్మతల్లి వారాలు



బాగువలసలో జరుగుతున్న వారాలు

సాలూరు: మండలంలోని బాగువలస, బోరబంద, దేవుబుచ్చింపేట, వల్లాపురం తదితర గ్రామాల్లో దేశమ్మతల్లి వారాలు ఆదివారం ఘనంగా జరిగాయి. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బస్సు కోసం మహిళల నిరీక్షణ



చినభోగిలి వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్న మహిళలు

సీతానగరం: మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న చినభోగిలి జంక్షన్ వద్ద మహిళలు బస్సుల కోసం ఆదివారం గంటన్నర సేపు మండుటెండలో నిరీక్షించాల్సి వచ్చింది. దుగ్గేరు, మక్కువ ప్రాంతాల నుంచి దూర ప్రాంతాలకు వెళ్లవలసిన మహిళలు చినభోగిలి జంక్షన్ వద్ద బస్సు మారాల్సి ఉండగా వారంతా ఉదయం జంక్షన్‌కు చేరుకోగా రాకపోకలు సాగిస్తున్న బస్సుల్లో మహిళా ప్రయాణికులకు టికెట్లు ఇవ్వడానికి స్టాపులవద్ద బస్సులు ఆగకుండా వెళ్లిపోతున్నాయని, దీంతో బస్సులు ఇక్కడ ఎక్కడానికి అవస్థలు పడ్డామని మహిళలు వాపోయారు. నిర్దేశించిన సమయానికి గమ్యానికి చేరుకోలేక పోతున్నామని బస్సు ఫ్రీ అనుకుని ప్రయాణం చేస్తే రోడ్డుపై గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని, అవసరానికి తగినట్లు పార్వతీపురం- బొబ్బిలి మధ్య బస్‌సర్వీసులు వేయాలని కోరుతున్నారు.

గాడిచర్లకు నివాళులు..

పాలకొండ రూరల్: గ్రంథాలయ ఉద్యమసమయంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు అందించిన సేవలు వెలకట్టలేనివని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు అన్నారు. గ్రంథాలయంలో గాడిచర్ల జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లైబ్రేరియన్ గణేష్ బాబు మాట్లాడుతూ.. 1906లో విజ్ఞానచంద్రికా గ్రంథమండలి నిర్వహణకు హరిసర్వోత్తమరావు అందించిన తోడ్పాటును వివరించారు. వందేమాతరం, జాతీయ ఉద్యమాల్లో గాడిచర్ల పాత్ర శ్లాఘనీయమని చెప్పారు. 1934లో ఏపీ గ్రంథాలయ సంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరించి వయోజన విద్యా కేంద్రాలను స్థాపించిన మొట్టమొదటి వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ ఐక్యవేదిక కన్వీనర్ నూతులపాటి భరత్‌భూషణ్, కౌన్సిలర్ భాసూరు కాంతారావు, సచివాలయ సిబ్బంది షణ్ముఖరావు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి



తంపటాపల్లిలో నీట మునిగిన వరి పంట దుస్థితి తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొండ రూరల్: ఉపరితల ఆవర్తన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని వరి పంట పొలాలు నీట మునిగాయి. ముఖ్యంగా మండల పరిధిలోని తంపటాపల్లి చుట్టుపక్కల ఉన్న తంపర, చిట్ట, రావాడ గెడ్డలు పొంగి పొర్లడంతో పాటు మడ్డువలస రిజర్వాయర్ గేట్లు ఎత్తివేయడంతో పొలాలు మునిగిపోయినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు అల్లు సురేష్‌కుమార్ సదరు రైతులతో కలసి ముంపునకు గురైన పొలాలను ఆదివారం పరిశీలించారు. జంపరకోట, నవగాం గెడ్డలతో పాటు మండలంలో మరికొన్ని చోట్ల జలవనరులు పొంగడంతో వరి పొలాల్లో నీరు చేరిందన్నారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి రైతులను ఆదుకోవాలన్నారు.

మంత్రి ఇలాకాలో మాయదారి కష్టాలు

- ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి నాయకులు
- నేడు మరమ్మతులకు నోచుకోని రహదారులు
- నిత్యం అవస్థల మధ్య సతమతమవుతున్న గిరిజనులు
- అత్యవసర వేళల్లో డోలీలే దిక్కు
- భారీ వర్షాలతో పెరిగిన ఇబ్బందులు



పూర్తిగా కంకర తేలి ఉన్న మండల కేంద్రం నుంచి కుంతాం వెళ్లే రోడ్డు



గుంతలమయంగా ఉన్న విశ్వనాథపురం రోడ్డు



అధ్వానంగా ఉన్న పెద్దవలస నుంచి బంధంవలస వెళ్లే రోడ్డు

పాచిపెంట:

గిరిజన మంత్రి ఇలాకాలో గిరిజనులకు రహదారి కష్టాలు తప్పడం లేదు. పాచిపెంట మండలంలోని పలు గిరిజన ప్రాంతాల రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పెద్దపెద్ద గుమ్ములు, గోతులు, కంకర తేలి ఉండడంతో ఆ రహదారుల గుండా ప్రయాణం సాగించాలంటే ఆయా గ్రామాల ప్రజలు, నరకంలా భావిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి. ఎన్నికలకు ముందు రహదారులు బాగు చేస్తామని చెప్పి హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్న మంత్రి నేడు రహదారుల బాగు కోసం కనీసం పట్టించుకోవడం లేదంటూ గిరిజన ప్రజాప్రతినిధులు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అధ్వానంగా ఉన్న రహదారుల్లో మచ్చుకు కొన్ని..

మండల కేంద్రం నుంచి కుంతాం వెళ్లే రోడ్డుపై పద్మాపురం, పెద్దవలస, కేసలి తదితర పంచాయతీలకు చెందిన సుమారు 30 గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ రహదారి పూర్తిగా పాడై కంకర తేలి ఉంటుంది. ద్విచక్ర వాహనాలు మినహా అంతకంటే పెద్ద వాహనాలు అటుగా వెళ్తే వాహనాలు వెంటనే మరమ్మతుల బారిన పడుతున్నాయి. గిరిజనులు పండించిన పంటలు అటవీ ఉత్పత్తులు మండల కేంద్రానికి తరలించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్‌హెచ్ 26 నుంచి మంచాడ వలస మీదుగా విశ్వనాథపురం వెళ్లే రోడ్డు పెద్దపెద్ద గుమ్ములు, గోతులతో అధ్వానంగా తయారైంది. గ్రామాల్లోకి కనీసం స్కూల్ బస్సు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ రహదారి గుండా రెండుసార్లు ప్రయాణం సాగిస్తే తప్పకుండా నడుము నొప్పి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. మాతుమూరు జంక్షన్ నుంచి కన్నయ్యవలసకు వెళ్లే రోడ్డుపై నుంచి గొట్టూరు, శతాబి, మూటకూడ, గరిసిగుడ్డి, తంగ్లం తదితర గిరిజన పంచాయతీలకు చెందిన సుమారు 50 గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ రహదారి పూర్తిగా పాడై ఎక్కడికక్కడ గుమ్ములు గోతులు ఉండడంతో అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనాలు కూడా గ్రామాల్లోకి రాక గిరిజన ప్రాంత ప్రజలకు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో వారు పడే ఇబ్బందులు వర్ణణాతీతం. పెద్దవలస నుంచి బంధం వలసకు వెళ్లే రోడ్డు మట్టి రోడ్డు కావడంతో చిన్నపాటి వర్షం కురిసినా పూర్తిగా బురదమయమై ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది కలుగుతోంది. గ్రామంలోకి ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి. ఇటీవల ఒకరు అనారోగ్యానికి గురైతే డోలీలో పెద్దవలస వరకు మోసుకువచ్చి అక్కడి నుంచి ఆటోలో పాచిపెంట పీహెచ్‌సీకి తరలించారు. వీటితో పాటు గురువునాయుడుపేట నుంచి రాయిగుడ్డి వలస మీదుగా నీలంవలసకు వెళ్లే రోడ్డు, అలాగే పారమ్మకొండ బీటీ రోడ్డు నుంచి పెదచీపురు వలస మీదుగా కోస్టువలస, గుంట మామిడివలస, తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయి. ఇప్పటికైనా కూటమి పాలకులు ఈ రోడ్డు నిర్మాణాలపై దృష్టిసారించి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని గిరిజన ప్రాంతాల ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

కొత్తది లేదు.. పాతది బాగుపడింది లేదు



కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలో ఒక కొత్త రోడ్డు మంజూరు కాలేదు. పాత రోడ్డు బాగుపడింది లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరై వివిధ దశల్లో ఉన్న పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో నాటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, నేటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రహదారులు బాగు చేస్తాం. డోలీమోతల నుంచి విముక్తి కలిస్తామని చెప్పిన మాటలు హామీలకే పరిమితమయ్యాయి. ఆ హామీలు ఎక్కడా కార్యరూపం దాల్చ లేదు.

– బడ్నాన ప్రమీల, ఎంపీపీ పాచిపెంట

చురుగ్గా యంత్రాలతో పూడికతీత, పారిశుధ్యపనులు



గాడెలవలసలో కాలువల్లో తీస్తున్న పూడికలు



పెదభోగిలి కాలనీలో చెత్తను తొలగిస్తున్న జేసీబీ

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో కాలువల్లో పూడిక తీతపనులు, వీధుల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో చిరుజల్లులు కురుస్తున్న కారణంగా వివిధ కారణాల వల్ల ప్రజలు జ్వరాల బారిన పడుతున్న సందర్భంగా తీసుకుంటున్న ముందు జాగ్రత్తచర్యల్లో భాగంగా సర్పంచ్‌లు జె.తేరేజమ్మ, బొన్నాడ అన్నపూర్ణమ్మల ఆధ్వర్యంలో పెదభోగిలి, హడ్కో కాలనీ, సీతానగరం, గాడెలవలస గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు యంత్రాలతో కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తీయించడం, వీధుల్లో పారిశుధ్య పనులు చేయించినట్లు చెప్పారు. అలాగే ఇప్పటికే లక్ష్మీపురం, బుడ్డిపేట, బూర్జ, సూరంపేట, మరిపివలస, చిన్నారాయుడుపేట గ్రామాల్లో పారిశుధ్యపనులు నిర్వహించామన్నారు. పారిశుధ్య పనులనంతరం చెత్తకుప్పలను దూర ప్రాంతాలకు తరలించి దోమలనివారణకు ఎబెట్ మందు పిచికారీ చేయించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మనోహర్, మురళి, సురేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా వారాల పండుగలు



మొక్కులు తీర్చుకునేందుకు ప్రసాదాలు, డప్పులతో వనంగుడికి వెళ్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో వారాలు, కలగొప్పుల పండుగలు ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభించిన వ్యవసాయ పనులు అమ్మవార్ల ఆశీస్సులతో నిర్విఘ్నంగా వరిఉభాలు, వరివెదలు, పత్తి, జొన్నపంటల సాగు జరిగాయన్న నమ్మకంతో పెదభోగిలి, మెట్టువీధి, గూడెం, సుంకరివీధి, సీతానగరం, బుడ్డిపేట గ్రామాల్లో వారాల పండగ నిర్వహించగా, కృష్ణారాయపురం, పెదంకలాం, సుమిత్రాపురం,వెంకటాపురం, తామరఖండి దయానిధిపురం తదితర గ్రామాల్లో రైతులు, వృత్తిదారులు కలగొప్పులు పేరుతో అమ్మవార్ల ఆశీస్సుల కోసం మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఆదివారం ఉదయం డప్పులు, సన్నాయిమేళం, హారతులు, వడపప్పు, చీరలు, పసుపు కుంకాలు, ప్రసాదాలతో అమ్మవారి పూనకంతో ఉన్న మహిళలతో ఊరేగింపుగా వీధుల్లో జానపద కళాకారుల విన్యాసాలతో వనంగుడికి వెళ్లి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ఏనుగులు తరలించి పంటలు రక్షించండి



ఏనుగులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

కొమరాడ: ఏనుగులు తరలించి, తమ పంటలు కాపాడాలని రైతులు కోరుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట గజరాజుల పాలవుతోందని, తామంతా నష్టపోతున్నామని వాపోతున్నారు. అధికారంలోకి రాగానే మండలంలో పలుచోట్ల తిష్టవేసిన ఏనుగులను తరలిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదంటున్నారు. కనీసం పంట నష్ట పరిహారం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజులుగా కొమరాడ మండలంలోని కళ్లికోట, దుగ్గి, గుణానపురం, గుమడ, కోటిపాం ప్రాంతాల్లో..మూడు రోజుల క్రితం వరకు కందివలస, రాజ్యలక్ష్మీపురం, కుమ్మరిగుంట తదితర గ్రామాల్లో తొమ్మిది ఏనుగుల గుంపు సంచరిస్తూ వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలను తొక్కి ధ్వంసం చేశాయని బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. అటవీ శాఖ అధికారులు కూడా తూతూమంత్రంగానే చర్యలు చేపడుతున్నారు తప్ప శాశ్వత చర్యలు చేపట్టడం లేదంటున్నారు.

వరిలో కుళ్లుతెగులు ఆకుముడతతో ఆందోళన



తెగుళ్ల నివారణకు ద్రావణాన్ని పిచికారీ చేసున్న రైతు

సీతానగరం: మండలంలోని పొలాల్లో వరి చేలకు సోకుతున్న తెగుళ్లతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మడులలో వరిచేలు ఏపుగా పెరడం వల్ల పెట్టుబడికి తగిన పంట ఆశాజనకంగా ఉంటుందని ఆశించిన రైతులు వరిలో ఆశించే తెగుల్లు చూసి దిగాలు పడుతున్నారు. వరిలో కుళ్లు తెగులు, ఆకుముడత తెగులు,కాండం తొలుచు తెగులు సోకడం వల్ల ఏపుగా పెరుగుతున్న వరిచేను పంటను చూసి ఆందోళనగా ఉందని వాపోతున్నారు. ముందుగా వరినాట్లు వేసిన బగ్గందొరవలస, బళ్ల కృష్ణాపురం, గెడ్డలుప్పి, తామరఖండి, వెంకటాపురం, బూర్జ, నిడగల్లు, కృష్ణారాయపురం, లక్ష్మీపురంతో పాటు వరి వెదలు వేసిన నిడగల్లు , నీలకంఠాపురం, దయానిధిపురం గ్రామాల్లో వరి పంటలకు తెగుళ్లు సోకాయని చెబుతున్నారు. వ్యవసాయాధికారులు వరిలో తెగుళ్లను పరిశీలించి నివారణ చర్యల నిమిత్తం సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

'గాలికుంటు'పై నిర్లక్ష్యం వద్దు..

- పశువులకు గాలికుంటు వ్యాధి ముప్పు
- వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి
- ఈ నెల 15 నుంచి వ్యాక్సినేషన్



ఆరుబయట మేత మేస్తున్న పశువులు

గుమ్మలక్ష్మీపురం: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి(ఫుట్ అండ్ మౌత్ డిసీజ్) అత్యంత ప్రమాదకరం. పాడిరైతులు, పశుపోషకులు అప్రమత్తం కావాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తే అన్నివిధాలా నష్టపోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అజాగ్రత్త కారణంగా వ్యాధి సోకే పశువులు ఒక్కోసారి ప్రాణాలు కూడా కోల్పోవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా వ్యాధికి గురైన పశువుల్లో పాలదిగుబడి తగ్గిపోవడంతో పాటు పనిచేసే సామర్థ్యం కూడా గణనీయంగా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే నెల(అక్టోబరు) 15వ తేదీ వరకు నెల రోజుల పాటు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నారు. వ్యాధి రాకుండా ముందస్తు నివారణ చర్యగా టీకాలు వేయనున్నారు. వ్యాధి సోకిన పశువుల పాలు తాగిన దూడలు కూడా చనిపోయే అవకాశం ఉంది. పిక్కోర్నావిరిడే అనే వైరస్ కలిగే ఈ వ్యాధి.. అంటువ్యాధి కావున వ్యాధి సోకిన వాటిని మిగతా మూగజీవాల నుంచి దూరంగా ఉంచాలి.

–వ్యాధి లక్షణాలివే..

గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు అధిక జ్వరం వస్తుంది. నోటి లోపల, నాలుక, చిగుళ్లు, పెదవులపై నీటిపొక్కులు ఏర్పడతాయి. ఇవి పగిలి పుండ్లుగా కూడా మారుతాయి. ఈ కారణంగా అవి మేత తినడానికి ఇబ్బంది పడతాయి. పశువుల పాదాలు, కాలిగిట్టల మధ్య నీటిపొక్కులుగా ఏర్పడి అవి పగిలి పుండ్లు అవ్వడంతో నడవడానికి ఇబ్బంది పడతాయి. దీనివల్లే పశువులు కుంటుతూ నడుస్తాయి. అందుకే ఈ వ్యాధిని గాలికుంటు వ్యాధి అని పిలుస్తారు. నోట్లో కూడా పుండ్లు ఏర్పడడం వల్ల చొంగ కారుస్తాయి.

–ఇలా వ్యాప్తి చెందుతుంది..

కలుషితమైన మేత, నీరు, పరికరాల ద్వారా ఈ గాలికుంటు వ్యాధి వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన పశువుల నుంచి ఆరోగ్యంగా ఉన్న పశువులకు ఇది నేరుగా వ్యాపిస్తుంది. అంతేకాకుండా గాలి ద్వారా కూడా ఈ వైరస్ కొంతదూరం వరకు వ్యాపిస్తుంది.

చికిత్స, నివారణ ఇలా..

గాలికుంటు వ్యాధి నివారణకు నిర్దిష్టమైన చికిత్స లేదు. సాధారణంగా వ్యాధి లక్షణాల ఆధారంగానే చికిత్స చేయాల్సి ఉంటుంది. పుండ్ల కారణంగా ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉండేందుకు యాంటీ బయాటిక్స్ ఉపయోగించవచ్చు. నోట్లోని పుండ్లను శుభ్రం చేయడానికి పొటాషియం పర్మాంగనేట్ వంటి ద్రావణం ఉపయోగించాలి. పాదాల పుండ్లకు అయోడిన్ లేదా ఇతర యాంటీసెప్టిక్ ద్రావణం వాడొచ్చు. అయితే ఈ వ్యాధి రాకుండా ఉండడానికి ముందస్తుగా టీకాలు వేయడం ముఖ్యం. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ టీకాలు వేయించాలి. అలాగే పశువులు ఉండే స్థలాలను శుభ్రంగా ఉంచాలి.

టీకాలను సద్వినియోగం చేసుకోవాలి..

పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణపై పాడిరైతులు అప్రమత్తం కావాలి. జాగ్రత్త పడితేనే పశువులను రక్షించుకోగలం. వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నాం. ఈ టీకాలను సద్వినియోగం చేసుకోవాలి. డెంకాడ, అక్కివరం, రఘుమండ గ్రామాలు కేంద్రంగా వ్యాక్సినేషన్ చేపడుతున్నాం. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–పి.లక్ష్మణరావు, పశువైద్యాధికారి, గుమ్మలక్ష్మీపురం